దుమ్ముతో అవస్థలు



శంకరపట్నం: కన్నాపూర్ రోడ్డుపై వాహనాలు ప్రయాణించడంతో దుమ్ము లేచి ఇతర వాహనదారులు, బాటసారులు ఇబ్బందులు పడుతున్నారు. బీటీ రోడ్డుపై భారీ వాహనాలు వెళ్తే దుమ్ము లేచి వెనక వస్తున్న వాహనదారుల కళ్లలో పడుతోంది. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి దుమ్ము లేవకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

పనులు పరిశీలన



జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని అబాది జమ్మికుంట వైకుంఠధామంలో నిర్వహిస్తున్న పనులను మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు శనివారం పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని సూచించారు. పెద్దంపల్లి క్రాస్ వద్ద ఇరువైపులా రోడ్డు కనిపించకుండా ఉన్న చెట్లను మున్సిపల్ జేసీబీతో తొలిగించే పనులను పర్యవేక్షించారు. కౌన్సిలర్లు దయ్యాల శ్రీనివాస్, గాజుల భాస్కర్, మాజీ ఎంపీపీ మమతదుర్గాప్రసాద్, పర్లపల్లి రమేశ్, నిమ్మల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



హుజూరాబాద్: రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతని, అందరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఎంవీఐ కంచి వేణు అన్నారు. శనివారం జాతీయ రోడ్డు భద్రత మహోత్సవం సందర్భంగా పోతిరెడ్డిపేట, సిర్సపల్లి, జూపాక ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. డ్రైవింగ్‌లో నైపుణ్యం సరిగా లేకపోవడం, రోడ్డు భద్రత జాగ్రత్తలు పాటించకపోవడం, అవగాహన లేకపోవడం, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడం వల్ల ప్రమాదాలు చాలా జరుగుతున్నాయని, ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లొద్దని కోరారు. ట్రాన్స్‌పోర్ట్ కానిస్టేబుల్ నాగరాజు, హోంగార్డ్ గుర్రం శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుట్టలకు రైతుబంధు

శంకరపట్నం: మండలంలోని ఓ రెవెన్యూ గ్రామం పరిధిలో గుట్టలకు రైతుబంధు పడినట్లు సర్వేతో వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది. మొలంగూర్ రెవెన్యూ గ్రామం పరిధిలోని చింతలపల్లి, మక్త గ్రామంలోని రెండు గుట్టల్లో కొంతమేర పట్టా భూములున్నాయి. గుట్ట అయినా మక్త గ్రామంలో సుమారు 10 ఎకరాల వరకు పట్టా కలిగిన వ్యక్తి రైతుబంధు తీసుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులు సర్వే చేస్తుండంతో గుట్టలకు రైతుబంధు గతంలో ప్రభుత్వం చెల్లించినట్లు తెలిసింది. సర్వే పూర్తి చేసి గ్రామసభ నిర్వహిస్తే సాగు భూములు, గుట్టలు, రహదారుల వివరాలు తేలనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

వార్డు సభలు సద్వినియోగం చేసుకోవాలి

హుజూరాబాద్: పట్టణంలోని 30 వార్డుల్లో నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకున్న పట్టణ ప్రజల కోసం ఈనెల 21, 22ల్లో వార్డు సభలు రాష్ట్ర కమిషనర్ పౌర సరఫరాల శాఖ ఆదేశాల జారీ మేరకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య తెలిపారు. 14 ప్రాంతాలను ఎంపిక చేసి వార్డు సభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈనెల 21న 15, 16, 17 వార్డు ప్రజలకు శంకర్ రైస్ మిల్లు ఎదురుగా, 3, 4, 18 వార్డు ప్రజలకు ప్రతాపవాడ ప్రైమరీ స్కూల్ ఏరియాలో, 19, 20 వార్డు ప్రజలకు రామ్‌గోపాల్ రైస్ మిల్ దగ్గర, 5, 6 వార్డు ప్రజలకు రజక సంఘం కార్యాలయం దగ్గర, 24, 14 వార్డు ప్రజలకు బోర్నపల్లి వార్డు కార్యాలయం వద్ద, 12, 01, 13 వార్డు ప్రజలకు ఇంద్రనగర్ స్కూల్ వద్ద, 9 వార్డు ప్రజలకు దమ్మక్కపేట వార్డు కార్యాలయం వద్ద సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 22న పట్టణంలోని 7, 22, 23 వార్డు ప్రజలకు గ్రీన్ ప్లెడ్జ్ స్కూల్ పక్కన, 8, 10, 11 వార్డు ప్రజలకు ఇప్పలనర్సింగపూర్ వార్డు కార్యాలయం వద్ద, 25, 29, 30 వార్డు ప్రజలకు గాంధీనగర్ స్కూల్ వద్ద, 26, 21 వార్డు ప్రజలకు సీఎస్ఐ చర్చి దగ్గర, 27వ వార్డు వారికి హనుమాన్ దేవాలయం దగ్గర, 28వ వార్డు వారికి కేరళ స్కూల్ దగ్గర, 2వ వార్డు ప్రజలకు గణేశ్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో సభలను నిర్వహిస్తున్నట్లు, పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మాజీ ఎమ్మెల్యేకు సంఘీభావం



రవిశంకర్‌కు సంఘీభావం తెలుపుతున్న నాయకులు

గంగాధర: ఇటీవల కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఇంటిపై దాడి చేయడంతో.. శనివారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు ఆయన ఇంటికెళ్లి సంఘీభావం ప్రకటించారు. కరీంనగర్ పట్టణ శాఖ అధ్యక్షుడు చల్లా హరిశంకర్, గ్రంథాలయ మాజీ చైర్మన్ పొన్నం అనిల్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ శేఖర్‌గౌడ్, యాదగిరి, శ్రీనివాస్, మోహన్, వసంతరావు, శ్రీనివాస్, రాజు, నాయకులున్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

శంకరపట్నం: మెట్‌పల్లి గ్రామంలో శనివారం సీసీ రోడ్డు పనులను మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. ఈజీఎస్ నిధులతో చేపట్టే పనులు నాణ్యతతో చేయాలని సూచించారు. మాజీ సర్పంచ్ పోచయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బస్వయ్య, మధు, షారూఖ్, గట్టయ్య, లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి



వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

జమ్మికుంట: కోరపల్లి, వెంకటేశ్వరపల్లిలో సాగు చేసుకుంటున్న రైతులకు చెందిన భూములను బోయిన సమ్మయ్య అనే వ్యక్తి అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకొని రైతుబంధు, రియల్ ఎస్టేట్ సాగిస్తూ పేద దళితులను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని తహసీల్దార్ రమేశ్‌కు శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. కోరపల్లి, వెంకటేశ్వరపల్లిలోని దొరలు, భూస్వాముల వద్ద కొనుగోలు చేసిన పేద దళితులు పట్టాలు ఎలా చేసుకోవాలో తెలియక పంటలు సాగు చేసి జీవనం సాగిస్తున్నారన్నారు. ఆన్‌లైన్ నమోదు లేవనే భూములను ధరణి వచ్చిన క్రమంలో 13బీ సృష్టించి అక్రమంగా కుటుంబ సభ్యుల పేరు రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని వాపోయారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

వీణవంక: మల్లారెడ్డిపల్లి గ్రామంలో శ్రీరామాంజనేయ ఆలయ నిర్మాణానికి దూలం శ్రీకాంత్‌గౌడ్ అనూష, దూలం లక్ష్మీరాజంగౌడ్ భారతమ్మ రూ.50,016 విరాళాన్ని మాజీ సర్పంచ్ మేకల ఎల్లారెడ్డికి అందజేశారు.

నిర్మించారు.. వదిలేశారు..

- ఏళ్లుగా నిరుపయోగంగా మినీ రిజర్వాయర్
- ప్రజాధనం వృథా



మినీ రిజర్వాయర్

ఇల్లందకుంట: 2010–14 కాలంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.14కోట్లతో అపర భద్రాద్రిగా పేరొందిన శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థాన సన్నిధిలో మినీ రిజర్వాయర్‌ను నిర్మించారు. ఇక్కడి నుంచి 10 గ్రామాలకు తాగునీరు అందించడంతోపాటు ఆలయానికి వచ్చే భక్తులు పర్యాటకుల కోసం బోటు సౌకర్యం కల్పించి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామన్న గత నేతల మాటలు ఆచరణలో సాధ్యం కాక నీటి మూటలుగా మిగిలాయి.

తెలంగాణ ప్రభుత్వంలో మిషన్ భగీరథ ప్రారంభం తర్వాత దీనికి ప్రాధాన్యం తగ్గింది. దీంతో ప్రారంభం చేయకుండానే అధికారులు, ప్రజాప్రతినిధులు దీనివైపు కన్నెత్తి చూడకపోవడంతో విలువైన మోటార్లు, పరికరాలు నిరుపయోగంగా మారాయి. రూ.కోట్లు పెట్టి నిర్మించి నిర్లక్ష్యంగా వదిలేసి ప్రజాధనం వృథా చేయడంపై ప్రజలు మండిపడుతున్నారు. మినీ రిజర్వాయర్ నిర్మాణంతో ఊర చెరువును రెండు భాగాలుగా విభజించారు. దీంతో ఊర చెరువులో నీటి సామర్థ్యం తగ్గి నీరు నిలువ లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి సరఫరా చేసే గ్రామాలకు పైపులైన్ వేశారు. కానీ తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం మిషన్ భగీరథ వచ్చిన తర్వాత కొన్నిచోట్ల పైపులైన్‌లు వేయకుండా ఇవే చూపెట్టి బిల్లులు పొందినట్లు ఆరోపణలున్నాయి. శ్రీరాములపల్లి, ఇల్లందకుంట గ్రామాల పరిధిలోని ఎస్ఆర్ఎస్పీ కెనాల్ దగ్గర నుంచి మినీ రిజర్వాయర్‌లోకి నీటిని సరఫరా చేసేందుకు పైపులైన్ వేశారు. అధికారుల పర్యవేక్షణ లేక నాసిరకం పైపులైన్‌లతో ప్రారంభానికి ముందే ట్రయల్ చేస్తున్న క్రమంలో పైపులు పగిలిపోయినట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు,. పగిలిన పైపులైన్ మరమ్మతు కోసం పలువురు అధికారులకు ఫిర్యాదు చేసినా సదరు కాంట్రాక్టర్ మరమ్మతు చేయకపోవడం గమనార్హం.

పర్యవేక్షణ లేక..

2017–18 మధ్యకాలంలో శ్యాంప్రసాద్‌ముఖర్జీ రూర్బన్ మిషన్ పథకం కింద స్వామివారి సన్నిధిలో రూ.50లక్షల నిధులు వెచ్చించి చిల్డ్రన్ పార్క్ పర్యాటక అభివృద్ధి పనులు చేపట్టారు. కొంతకాలం పచ్చని మొక్కలు, పలు పూల మొక్కలతో చిల్డ్రన్ పార్క్ ఎంతో చూడముచ్చటగా ఉండేది. కానీ తర్వాత పట్టించుకునేవారు కరువయ్యారు. ప్రస్తుతం పరిసరాలు చెత్తాచెదారంతో కనిపిస్తున్నాయి.

ఇరిగేషన్ శాఖ మిషన్ భగీరథ నిర్వహణ బాధ్యత గ్రామ పంచాయతీకి అప్పగించింది. పంచాయతీలో నిర్వహణకు ప్రత్యేక నిధులు లేక, అధికారులు, ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ లేక మరమ్మతు చేయక కొన్ని పరికరాలు తుప్పు పట్టాయి. మరికొన్ని చోరీకి గురయ్యాయి.

నివేదిక పంపాం

ఆయా శాఖల నుంచి నిర్వహణ బాధ్యత గ్రామ పంచాయతీకిచ్చారు. నిధుల కోసం గతంలో రెండుసార్లు నివేదిక పంపాం. కానీ ఎలాంటి స్పందన లేదు. దీంతో పంచాయతీలో ప్రత్యేక నిధుల్లేక నిర్వహణ చేయలేకపోతున్నాం.

– రాజేశ్వర్‌రావు, ఎంపీవో, ఇల్లందకుంట



రామడుగు: వెదిర గ్రామ పంచాయతీ పరిధిలోని పద్మశాలీకాలనీ వెదిర నుంచి హిమ్మత్‌నగర్ వెళ్లే రహదారిలో మిషన్ భగీరథ పైపులైన్ పగలి నిత్యం నీరు వృథాగా పోతున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారని గ్రామస్తులు వాపోతున్నారు. కొద్ది రోజుల నుంచి పైపులైన్ పగిలి నీరు వృథాగా పోతోందని, పలుమార్లు అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదన్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
శారణ్, ఏఈ, మిషన్ భగీరథ, రామడుగు, సెల్ నంబర్: 6309954418

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



నవాబుపేటలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొన్నం

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాల్లో రూ.8.48కోట్ల విలువ గల అభివృద్ధి పనులకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం శంకుస్థాపన చేశారు. నవాబుపేట్‌లో రూ.20లక్షలతో అంగన్‌వాడీ భవన నిర్మాణం, సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కొండాపూర్‌లో రూ.15లక్షలతో సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణానికి, సుందరగిరి గ్రామ పరిధిలో రూ.2.22కోట్లతో బంజేరుపల్లి గ్రామానికి బీటీ రోడ్డు, సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణానికి రూ.35లక్షలతో, చిగురుమామిడి నుంచి పీచుపల్లి వరకు రూ.2.97కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి, రూ.45లక్షలతో సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణానికి, చిగురుమామిడి బైపాస్ నుంచి రేకొండ వరకు రూ.1.97కోట్లతో బీటీ, రామంచ గ్రామంలో రూ.12లక్షలతో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జిల్లా అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ) లక్ష్మికిరణ్, ఆర్డీవో మహేశ్వర్, మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, పలువురు అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కౌశిక్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

హుజూరాబాద్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధికశ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఫ్లెక్సీకి శనివారం బీఆర్ఎస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసేవరకు ప్రజాపక్షాన పోరాడుతూనే ఉంటామని అన్నారు. ఎస్సీ కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు బండ శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, కౌన్సిలర్లు ప్రతాప తిరుమల్‌రెడ్డి, అపరాధ ముత్యంరాజు, ముక్క రమేశ్, తాళ్లపల్లి శ్రీనివాస్, మక్కపల్లి కుమార్, కేసిరెడ్డి లావణ్య, ఆలేటి సుశీల, సీనియర్ నాయకులు వర్దినేని రవీందర్‌రావు, మొలుగు పూర్ణచందర్, కొండ్ర నరేశ్, ఇమ్రాన్, అమ్జాదుల్లాఖాన్, పంజాల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రంగస్థల నటుడికి సన్మానం



ప్రభాకర్‌ను సన్మానిస్తున్న వాకర్స్ మిత్రులు

హుజూరాబాద్: జిల్లా కళాకారుల సంక్షేమ సమాజాల సమైక్య జిల్లా ఉపాధ్యక్షుడిగా కుడికాల ప్రభాకర్ ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా శనివారం హైస్కూల్ మైదానంలో ప్రభాకర్ మిత్రులు, వాకర్స్ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. పట్టణానికి చెందిన కుడికాల ప్రభాకర్ సీనియర్ రంగస్థల కళాకారుడిగా జిల్లా, రాష్ట్రస్థాయిలో అనేక ప్రాంతాల్లో వివిధ నాటక ప్రదర్శనలిచ్చారు. నాటక రంగంపై తన కున్న ఆసక్తితో నాటక ప్రదర్శనలు చేస్తున్నట్లు ప్రభాకర్ తెలిపారు. గోలి శ్రీనివాస్, క్యాస ఉపేందర్, కొలిపాక శ్రీనివాస్, ఆకుల సదానందం, డాక్టర్ తడికమళ్ల శేఖర్, తిరునగరి రమేశ్, మార్త రవీందర్, బొడిగ మల్లయ్య, వేల్పుల ప్రభాకర్, పంజాల శ్రీధర్, మనోహర్, సత్యనారాయణ తదితరులు న్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



అక్షిత్‌ను అభినందిస్తున్న పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్

ఖేల్

రామడుగు: వెలిచాల గ్రామ సరస్వతి పాఠశాలకు చెందిన బి.అక్షిత్(9వతరగతి) రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ ఉప్పుల శ్రీనివాస్ తెలిపారు. డిసెంబర్ 24న రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో అక్షిత్ ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. పాఠశాల కరస్పాండెంట్ ఉప్పుల శ్రీనివాస్ అభినందించారు. కోకరస్పాండెంట్ సత్యం, పీఈటీ సాయికృష్ణ పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలకు..



విద్యార్థిని అభినందిస్తున్న హెచ్‌ఎం రాజిరెడ్డి

చొప్పదండి: పట్టణంలోని జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని పిట్టల అక్షయ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్–17 క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 20 నుంచి ఖమ్మంలో జరిగే రాష్ట్ర పోటీలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా తరఫున పాల్గొనేందుకు ఎంపికయ్యారు. జగిత్యాలలో జరిగిన ఉమ్మడి జిల్లా పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థితోపాటు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు కె.కృష్ణను ప్రధానోపాధ్యాయుడు వైద్యుల రాజిరెడ్డి అభినందించారు.

సన్మానం



ప్రభాస్‌ను సన్మానిస్తున్న నాయకులు

హుజూరాబాద్: నిరుపేద దళిత కుటుంబానికి చెందిన తిమ్మాపూర్ మండలం మొగిళిపాలెం గ్రామానికి చెందిన రోజువారీ కూలి పనులు చేసుకునే సముద్రాల రాములు, స్వరూప దంపతుల కుమారుడు ప్రభాస్ అండర్–19 జాతీయ క్రికెట్ జట్టుకు ఎంపికై 2025 జనవరి 8, 9ల్లో లక్నోలో జరిగిన పోటీల్లో రన్నరప్‌గా నిలిచిన సందర్భంగా శనివారం ఎమ్మార్పీఎస్ హుజూరాబాద్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు పూలమాల, శాలువాతో సన్మానించారు. కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ రాష్ట్ర చైర్మన్ తిప్పారపు సంపత్, బీఆర్ఎస్ పట్టణ నాయకుడు కొలిపాక శ్రీనివాస్, రుద్రారపు రామచంద్రం, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శేఖర్, మొలుగూరి ప్రభాకర్, ఎర్ర శ్రీధర్, ఎర్ర నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో ఇందిరమ్మ ఇల్లు

శంకరపట్నం: ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మోడల్ ఇందిరమ్మ ఇంటిని నిర్మించనున్నట్లు ఎంపీడీవో కృష్ణప్రసాద్ తెలిపారు. గ్రామాల్లో అధికారులు ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుల సర్వే చేస్తున్నారు. ఎంపికైన లబ్ధిదారులు ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకునేందుకు మోడల్ ఇందిరమ్మ ఇంటిని చూసి నిర్మించుకుంటారని తెలిపారు. జిల్లాలో గృహ నిర్మాణ శాఖలో ఇద్దరు డీఈలు, ఇద్దరు ఏఈలు న్నారు.

పోలీసుల వినూత్న ప్రచారం



కేశవపట్నం ఎస్సై పోస్టు

శంకరపట్నం: సోషల్ మీడియాలో వస్తున్న వాటికి ఆకర్షితులై ఆర్థిక మోసాలకు గురవుతున్న వైనంపై కేశవపట్నం ఎస్సై రవి వినూత్న రీతిలో మండలంలోని వాట్సాప్ వేదికగా పోస్టులు పెడుతూ ప్రచారం చేస్తున్నారు. సోషల్ మీడియాలో అపరిచిత స్నేహితులతో జాగ్రత్త, తియ్యటి మాటలకు పడిపోవద్దు, మీ వ్యక్తిగత వివరాలు, పర్సనల్ ఫొటోలు అస్సలు పంపొద్దు, అపరిచిత స్నేహితులతో దూరంగా ఉండడం మంచిదని తెలంగాణ పోలీస్ పేరిట ముద్రించిన ప్రకటనతో మండలంలో వాట్సాప్ వేదికగా ఎస్సై పోస్టు చేసి ప్రజలు, యువతను ఆలోచింపజేశారు.

పీవీ విగ్రహం ఏర్పాటుకు సహకరించాలి

హుజూరాబాద్: పట్టణానికి చెందిన పీవీ సేవా సమితి ఆధ్వర్యంలో పీవీ విగ్రహ ఏర్పాటుకు సహకరించాలని శనివారం కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం సమర్పించారు.

వేణు మృతి బాధాకరం



నవాబుపేటలో చాడ వెంకట్‌రెడ్డి

చిగురుమామిడి: మాజీ సర్పంచ్ చెప్యాల వేణు గుండెపోటుతో మృతిచెందడం అత్యంత బాధాకరమని సీపీఐ జాతీయ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం ఆయన నవాబుపేట్‌లో వేణు కుటుంబ సభ్యులను పరామర్శించి భరోసా ఇచ్చారు. వేణు తండ్రి కూడా గతంలో సర్పంచ్‌గా ఉన్న సమయంలో బీసీల సదస్సు కోసం హైదరాబాద్ వెళ్లి తిరిగి వస్తుండగా గుండెపోటుతో హఠాన్మరణం చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. వేణు కుటుంబానికి సీపీఐ అండగా ఉంటుందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు అందె స్వామి, గూడెం లక్ష్మి, మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, నాయకులు తేరాల సత్యనారాయణ, అందె చిన్నస్వామి, ముద్రకోల రాజయ్య, కాంతాల శ్రీనివాస్‌రెడ్డి, ఎనగందుల రాజయ్య, బూడిద సదాశివ, మహేందర్, తాళ్లపల్లి చంద్రయ్య, గందె కొంరయ్య ఉన్నారు.

అర్హులందరికీ మంజూరు చేయాలి



కార్యదర్శికి ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

చొప్పదండి: రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసిన అర్హులందరికీ కార్డులు మంజూరు చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. రాగంపేటలో రేషన్ కార్డులు రాని లబ్ధిదారులతో కలిసి స్థానిక కార్యదర్శికి కార్డులను తక్షణమే మంజూరు చేయాలని కోరుతూ ఫిర్యాదు చేశారు. దరఖాస్తు చేసుకున్న అల్పాదాయ వర్గాల్లో సుమారు 25 శాతం మందికి మాత్రమే రేషన్ కార్డులు మంజూరు చేశారని ఆరోపించారు. రాగంపేటలో 290 మంది దరఖాస్తు చేస్తే 69 మందికి మాత్రమే రేషన్ కార్డులు మంజూరయ్యాయని తెలిపారు. ఎరుకల తిరుపతిగౌడ్, యాంసాని మల్లేశ్, బొమ్మరవేని సంతోశ్, అలిశెట్టి మల్లేశం, బొమ్మరవేని రవి తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు



తిమ్మాపూర్: పోలంపల్లి, నర్సింగాపూర్ అంగన్వాడీ కేంద్రాల్లో శనివారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. అనుపురం రఘువీర్ పుట్టినరోజు సందర్భంగా 20 మంది గర్భిణులకు సీమంతాలు ఘనంగా చేశారు. ప్రత్యేక అధికారి డాక్టర్ కిరణ్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వెంకటలక్ష్మి, ఇస్రాత్, జెడ్పీహెచ్ఎస్ ఇన్‌చార్జి హెచ్ఎం రమేశ్, పీఎస్ హెచ్ఎం రవీందర్‌రెడ్డి, పంచాయతీ సెక్రటరీ మధుమితరెడ్డి, అంగన్వాడీ టీచర్లు సుమలత, రేణుక, రాజేశ్వరి, సీఏలు పద్మ, లత తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా హరిప్రసాద్



హుజూరాబాద్: ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా తలకొక్కుల హరిప్రసాద్‌ను శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని విద్యానగర్‌లో అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అసోసియేషన్ సభ్యుల ప్రయోజనాలపై చర్చించారు. ఉపాధ్యక్షుడు యాకుబ్ అలీ, ప్రధాన కార్యదర్శి దూలం చిరంజీవి, శ్రీశైలం, వొడపల్లి రాజు, మధుకర్, ఎడ్ల కుమార్, భాషబోయిన రాజేశ్, బింగి మురళి, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయం ఆవరణలో బోరు



హుజూరాబాద్: కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ సహాయ సహకారాలతో వెంకట్రావుపల్లి గ్రామంలోని శివాలయం ఆవరణలో శనివారం బోరు వేశారు. మండల అధ్యక్షుడు కొల్లూరి కిరణ్‌కుమార్, వెంకట్రావుపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు ఆవుల సంపత్, గ్రామ నాయకులు కన్నబోయిన శ్రీనివాస్‌యాదవ్, చొప్పదండి విజేందర్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తులపై కేసు

రామడుగు: గోపాల్‌రావుపేటకు చెందిన శ్రీనివాస్‌రెడ్డి పది గుంటల స్థలంలో శనివారం హద్దు రాళ్లు పాతుతుండగా.. గుండికి చెందిన ముంజల మల్లయ్య, ముంజల లక్ష్మి, ముంజల రజిత అడ్డుకున్నారు. బూతులు తిట్టారని ఫిర్యాదు ఇవ్వడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శేఖర్ తెలిపారు.